సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 28 । సెప్టెంబర్ । 2025



జాక్‌పాట్ పేరుతో మోసం

జాక్‌పాట్ పేరుతో వ్యాపారులు తమను దోచుకుంటున్నారని మార్కెటింగ్ శాఖ అధికారులకు టమాట రైతులు శనివారం ఫిర్యాదు చేశారు. -IIలో



అక్రమాలకు చరమగీతం పలికే ఆయుధం డిజిటల్ బుక్

అక్రమాలకు చరమగీతం పలికే ఆయుధంగా డిజిటల్ బుక్ మారుతుందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పేర్కొన్నారు. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.200
రెండోరకం	రూ.100	రూ.150

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 202 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

వీరభద్రస్వామికి వెండి గద బహూకరణ



ఈవో రమణరెడ్డికి వెండి గదను అందజేస్తున్న ప్రవీణ్ చాడిచాల్

రాయచోటి టౌన్: రాయచోటి భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామికి కర్నాటకలోని ధార్వాడ్ గ్రామానికి చెందిన ప్రవీణ్ చాడిచాల్ వెండి గదను బహూకరించారు. శనివారం ఆలయ ఈవో డీవీ రమణారెడ్డికి దీనిని అందజేశారు. గద విలువ రూ. 50నుంచి రూ. 55 వేలు ఉంటుందని, దీనికి సంబంధించిన రసీదును అందజేసినట్లు ఈవో తెలిపారు. దాత పేరున స్వామి, అమ్మవార్లకు అర్చకులు పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం



నూతన పట్టు వస్త్రాలను తీసుకొస్తున్న టీటీడీ అధికారులు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో శనివారం సీతారామలక్ష్మణ మూర్తులకు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. ముందుగా గర్భాలయంలోని మూల విరాట్‌కు అర్చకులు పంచామృతాభిషేకం నిర్వహించారు. టీటీడీ అధికారులు తీసుకొచ్చిన పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, తులసి గజమాలలతో అందంగా అలంకరించారు. అనంతరం స్నపన తిరుమంజనాన్ని నిర్వహించారు.

సీటు కోసం పాట్లు



రాజంపేట పాతబస్టాండులో ప్రయాణికుల రద్దీ

రాజంపేట టౌన్: ఇప్పటికే ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు సెలవులు ఇచ్చారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్, ఇంజినీరింగ్ కళాశాలలకు సెలవులు ఇవ్వడంతో విద్యార్థులు, ప్రజలు తమ స్వగ్రామాలకు, బంధువుల ఇళ్లకు పయనం అవుతున్నారు. దీంతో అన్ని మార్గాల్లో తిరిగే బస్సులు కిక్కిరిస్తున్నాయి. ఇదిలావుంటే శనివారం రాజంపేట పాతబస్టాండు ప్రయాణికులతో కిటకిటలాడింది. బస్సుల్లో సీట్లు దొరకక ఇబ్బందులు పడ్డారు. చాలామంది బస్సుకు ఎదురెళ్లి కిటికీల నుంచి సీట్లు పెట్టుకునేందుకు పోటీపడ్డారు. దసరా ముందు రోజు వరకు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, ఆర్టీసీ ఉన్నతాధికారులు అదనపు సర్వీసులు నడపాలని ప్రజలు కోరుతున్నారు.

నాడిపట్టే వారేరీ?

ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు పేదల పాలిట శాపంగా పరిణమిస్తున్నాయి. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం అక్కడ పనిచేసే వైద్యుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్య వైఖరి అవలంబించడంతో గత్యంతరం లేక ఈనెల 26 నుంచి సమ్మెబాట పట్టారు. ఫలితంగా పీహెచ్‌సీలలో వైద్యసేవలు నిలిచిపోయాయి. సీజనల్ జ్వరాలు విజృంభిస్తున్న తరుణంలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో పల్లె వాసుల ప్రాథమిక వైద్యానికి ఆటంకం ఏర్పడింది.



చిన్నమండెం మండలం చాకిబండ పీహెచ్‌సీ భవనం

- పీహెచ్‌సీ వైద్యుల సమ్మెబాట
- వైద్యసేవలకు ఆటంకం
- ప్రజలకు తప్పని అవస్థలు

రాయచోటి: కూటమి ప్రభుత్వ వైఖరితో పల్లెవైద్యం పడకేసింది. వెద్యుల డిమాండ్ల గురించి పట్టించుకోకపోవడంతో వారు ప్రజానాడిని వదిలి సమస్యల పరిష్కారం కోరుతూ ఆందోళన చేపట్టారు.

- కూటమి ప్రభుత్వం వచ్చీ రాగానే జీఓ నంబర్-85 జారీ చేసింది. ఈ జీఓ రాకతో పీహెచ్‌సీల్లో పనిచేసే వైద్యుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో మూడేళ్లు పనిచేసే వైద్యులు..గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లు పనిచేసే వైద్యులు పీజీ చేసేందుకు 30 శాతం కోటాను కేటాయించేవారు. జీఓ 85 కారణంగా ప్రభుత్వం 30 శాతం ఉన్న కోటాను 15 శాతానికి తగ్గించింది. దీంతో వైద్యులు తమ భవిష్యత్తును ప్రభుత్వం దారుణంగా దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా జీఓ-85, 99గా మారింది. అలాగే మిగిలిన సమస్యల పరిష్కారానికి ఈ నెల 26వ తేదీ నుంచి దశల వారీగా ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ (ఏపీపీహెచ్‌సీ డీఏ) ఆధ్వర్యంలో సమ్మెను ప్రారంభించారు. 2024 సెప్టెంబర్‌లో కూడా వైద్యులు సమ్మె చేశారు. ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. ఏడాది దాటినా హామీలు అమలు కాకపోవడంతో మరోమారు వైద్యులు ఆందోళన బాట పట్టారు.
- శనివారం కూడా జిల్లా వ్యాప్తంగా వైద్యులు నిరసనను వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి రోజువారీగా పంపాల్సిన ఆసుపత్రి నివేదికలను నిలుపుదల చేశారు. 104 ఇతర వైద్యసేవల కార్యక్రమాలకు హాజరుకాలేదు. కేవలం ఆసుపత్రులలో వచ్చిన పేషెంట్లకు మాత్రం చికిత్సలు అందించారు. జిల్లాలోని చాలా ఆరోగ్య కేంద్రాల్లో పారాసెటిమాల్ మందులు కొరత కనిపిస్తోంది.

సమ్మె కార్యాచరణ ఇలా..

- 28న వాట్సప్ గ్రూప్ బహిష్కరణ
- 29న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసర సేవలు మినహా అన్ని ఓపీ సేవలు బంద్
- 30 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు
- 3 నుంచి విజయవాడలో వైద్యాధికారుల నిరసనలు, నాయకుల నిరవధిక నిరాహార దీక్షలు

ప్రధాన డిమాండ్లు ఇవీ...

- ఇన్-సర్వీస్ కోటాను పునరుద్ధరించాలి
- టైమ్-బౌండ్ ప్రమోషన్లు అమలు చేయాలి
- గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి బేసిక్ పే 50% ట్రైబల్ అలవెన్స్ మంజూరు చేయాలి.
- నోషనల్ ఇంక్రిమెంట్స్ మంజూరు చేయాలి..
- చంద్రన్న సంచార చికిత్స ప్రోగ్రామ్ కింద వైద్యులకు రూ 5 వేల అలవెన్స్ మంజూరు చేయాలి
- నేటివిటీ – అర్బన్ ఎలిజిబిలిటీ సమస్యలను పరిష్కరించాలి.

తక్షణమే పరిష్కరించాల్సిన సమస్యలు....

- వైద్యులకు కచ్చితమైన పని గంటలు, స్థిరమైన వారాంతపు సెలవు మంజూరు చేయాలి.
- వైద్యుల జాబ్ చార్ట్ ఇవ్వాలి
- అనధికారిక వ్యక్తులు (ఉదాహరణకు నాన్ మెడికల్ శాఖ కు సంబంధం లేనివారు) విచ్చలవిడిగా తనిఖీలు నిర్వహించకుండా స్పష్టమైన మార్గదర్శకాలు చేయాలి.

గ్రామీణులకు ఇబ్బందులు

గ్రామీణులకు ఏ అనారోగ్య సమస్య తలెత్తినా చెంతనే ఉన్న పీహెచ్‌సీకి వెళ్లి అక్కడ లభించే ఉచిత వైద్యసేవల ద్వారా ఊరట పొందేవారు. ఆసుపత్రిలో వైద్యుడే లేకపోతే స్థానికులకు అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అసలే ఇది సీజనల్ వ్యాధుల కాలం. కీళ్ల తదితర ఒళ్లునొప్పులతో కూడిన డెంగీ తదితర జ్వరాలు వస్తున్నాయి. దీంతో ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులు.. ఆర్ఎంపీలను ఆశ్రయించి జేబులు ఖాళీ చేసుకునే అవకాశం ఉంది. పీహెచ్‌సీల్లో వైద్యులు సమ్మెలో ఉంటే ఆ ప్రభావం క్షేత్రస్థాయిలో ఫ్యామిలీ ఫిజీషియన్ తదితర వైద్యసేవలపై పెనుప్రభావం పడే అవకాశం ఉంది. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం ఏమాత్రం స్పందించకపోవడం పట్ల ప్రజలు విస్తుపోతున్నారు.

పరిష్కారం లభించే వరకు పోరాటం



పీహెచ్‌సీలలో పని చేస్తున్న వైద్యులకు ప్రభుత్వం వైపు నుంచి పరిష్కారం లభించే వరకు పోరాటాలు చేస్తాం. గ్రామీణ ప్రాంతాల్లో 25 ఏళ్లుగా ప్రభుత్వ వైద్యాధికారులు పనిచేస్తున్నారు. పదోన్నతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ పీహెచ్‌సీల్లో అరకొర సౌకర్యాల మధ్య విధులను నిర్వహిస్తున్న వైద్యాధికారులకు పీజీ కోటా తగ్గించడం తగదు. ప్రజలు తమ సమస్యలను అర్థం చేసుకొని ఆందోళనలకు మద్దతు తెలపాలి.

– డాక్టర్ బి.రమేష్‌బాబు, జిల్లా అధ్యక్షులు, ఏపీ పీహెచ్‌సీడీఏ

జిల్లాలో పీహెచ్‌సీల వివరాలు

పీహెచ్‌సీలు:	50
ఒక ఆసుపత్రిలో ఉండే వైద్యులు:	02
మొత్తం పనిచేస్తున్న వైద్యులు:	106
లభించే మందుల రకాలు:	175
వైద్య పరీక్షల రకాలు:	63

ఉమ్మడి కడప జిల్లా కళలకు కాణాచి



మన కడప- ఘన గడప పాట వీడియో ఆవిష్కరిస్తున్న డీఈఓ షేక్ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి కడపజిల్లా కళలకు కాణాచి అని సంస్కృతి, సంప్రదాయాలకు, ఆత్మీయతకు పెట్టింది పేరని జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్ పేర్కొన్నారు. శనివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని సభాభవనంలో రచయిత, ఉపాధ్యాయుడు గజ్జల వెంకటేశ్వర రెడ్డి రచించిన మన కడప-ఘన గడప పాటకు సంబంధించిన వీడియోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ షేక్ షంషుద్దీన్ మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాలోని ఆధ్యాత్మిక స్థలాలు, దర్శనీయస్థలాలు, నదులు, ఖనిజ సంపద, కవులు,ఆటలు తదితల అంశాను కూర్చి అద్భుతమైన పాటను రచించి,గానం చేసి వీడియోగా చిత్రీకరించిన వెంకటేశ్వర రెడ్డికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఆత్మీయ అతిథులుగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డీకే చదువులబాబు, ఏఎంఓ. వీరేంద్ర, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్ రెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్ రెడ్డి, ఎస్టీయూ అధ్యక్షు రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు బాలగంగి రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా, ఎన్‌టీఏ జిల్లా అధ్యక్షుడు రామ కృష్ణంరాజు, లెక్కలవారి పల్లె ప్రధానోపాధ్యాయుడు నరసింహులు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయ్ కుమార్, మహేష్ బాబు, వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు సజ్జల రమణారెడ్డి, ఆర్‌జేయూపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు, సైన్స్ ఉపాధ్యాయులు వేపరాల ఎబినేజర్, సైన్స్ మ్యూజియం క్యూరేటర్ రెహ్మాన్ , కౌశల్ జిల్లా కో-ఆర్డినేటర్ విజయ మోహన్ రెడ్డి, సైన్స్ కో ఆర్డినేటర్ సుబ్బానాయుడు పాల్గొన్నారు.

చూసిన కనులదే భాగ్యం



మదనపల్లె సిటీ: వారాహి అలంకారంలో వాసవీకన్యకా పరమేశ్వరి



రాజంపేట టౌన్: వాసవీమాతను ఊరేగిస్తున్న భక్తులు

జిల్లావ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. అమ్మవారి నామస్మరణ మార్మోగుతోంది.జగజ్జనని ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి.ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులను కటాక్షించారు.అమ్మవారిని కనులారా దర్శించుకున్న భక్తులు తన్మయత్వంలో మునిగిపోయారు. -సాక్షి నెట్‌వర్క్





రాయచోటి టౌన్: శ్రీకామాక్షి దేవిగా దర్శనమిస్తున్న భద్రకాళీ అమ్మవారు, ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో భక్తజన సందడి

ప్రయాణం.. ప్రమాదకరం



దెబ్బతిన్న బ్రిడ్జిపై వెళుతున్న వాహనాలు



టి.గొల్లపల్లె వద్ద మాండవీయనదిపై తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బ్రిడ్జి

- మాండవీయనది వంకపై కూలిపోయిన వంతెనలు
- 20 గ్రామాలకు రవాణా బంద్

గుర్రంకొండ: మండలంలోని టి.పసలవాండ్లపల్లె గ్రామం..అదొక మారుమూల ప్రాంతం. ఇరువైపులా కొండలు.. మధ్యలో 20 గ్రామాలతో పంచాయతీ విస్తరించి ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు మాండవీయ నది వంక ఉధృతంగా ప్రవహించడంతో టి.గొల్లపల్లె వద్ద ఉన్న బ్రిడ్జి కుప్పకూలిపోయింది. పిల్లావాండ్లపల్లె వద్ద ఉన్న మరో బ్రిడ్జి సగం వరకు దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. అప్పటి నుంచి 20 గ్రామాలకు వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అధికారులు టి.గొల్లపల్లె వద్ద కొట్టుకుపోయిన బ్రిడ్జి స్థానంలో తాత్కలికంగా మట్టి, సిమెంట్ పైపులు వేసి రహదారిని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వీటిపై చిన్న ఆటోలు, ద్విచక్రవాహనాలు మాత్రమే అతికష్టం మీద వెళుతున్నాయి. ఏదైనా పెద్ద వాహనం వచ్చిందంటే తాత్కాలిక బ్రిడ్జి కుంగిపోతుంది. ఇప్పటికే బ్రిడ్జి పై రంధ్రాలు కూడా ఏర్పడటంతో పరిస్థితి ప్రమాదకరంగా మారింది. దీంతో అటువైపు వెళ్లే వాహనదారులు సగం దారి వరకు వచ్చి వెనుదిరిగి వెళ్లిపోతున్నారు. కాగా పదిహేను రోజుల నుంచి ఈ మార్గంలో బస్సు కూడా తిరగడం లేదు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

- రాయచోటి- అంగళ్లు జాతీయ రహదారికి పక్కనే కొండల మధ్య ఉన్న 20 గ్రామాలకు పదిహేను రోజులుగా బస్సు సర్వీసు నిలిపివేశారు. రాయచోటి నుంచి చిన్నమండ్యం, కేశాపురం, టి.పసలవాండ్లపల్లె మీదుగా కలిచెర్ల వరకు బస్సు సర్వీసు నడిపేవారు. ప్రతిరోజు 5 మార్లు బస్సు తిప్పేవారు. వివిధ పనుల మీద వందలాది మంది ప్రజలు బయట ప్రాంతాలకు వెళ్లేవారు. మాండవీయనది వంకపై ఉన్న బ్రిడ్జి కూలిపోవడంతో ఉన్న ఒక్క బస్సు సర్వీసు నిలిచిపోయింది. దీంతో అధిక డబ్బులు చెల్లించి ఆటోల్లో కేశాపురానికి చేరుకుంటున్నారు.కలిచెర్ల నుంచి రాయచోటి వెళ్లే మార్గం మూసుకుపోవడంతో అక్కడి ప్రజలు పెద్దమండ్యం, గాలివీడుకు వెళ్లి రాయచోటికి చేరుకుంటున్నారు. పిల్లావాండ్లపల్లె హరిజనవాడ వద్ద ఉన్న సిమెంట్‌రోడ్డు దెబ్బతింది. దీనివల్ల కుమ్మరపల్లె, ఎగువ,దిగువ మొరంపల్లె,పిల్లావాండ్లపల్లె గ్రామాల ప్రజలు పంచాయతీకస్బా అయిన టి.పసలవాండ్లపల్లెకు చేరుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నారు. మళ్లీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో 20 గ్రామాల ప్రజలకు ప్రమాదంపొంచి ఉంది.

మరమ్మతులు చేపట్టాలి



మాండవీయ నదిపై కొట్టుకుపోయిన బ్రిడ్జికి, పిల్లావాండ్లపల్లె హరిజనవాడ వద్ద దెబ్బతిన్న బ్రిడ్జి,సిమెంట్ రోడ్డుకు మరమ్మతులు చేట్టాలి.మళ్లీ వర్షాలు కురిస్తే పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు భయపడుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలి. – ఓబులరెడ్డి, ఎగువమొరంపల్లె

క్లుప్తంగా

కోడి పందెం రాయుళ్ల అరెస్టు

లింగాల : మండలంలోని దొండవాగుకు సమీపంలో టీడీపీ నాయకుడు దేవిరెడ్డి సంజీవరెడ్డి గోదాం వద్ద కోడిపందెం నిర్వహిస్తుండగా ఇన్‌ఛార్జి ఎస్‌ఐ రవికుమార్, పోలీసులు దాడులు నిర్వహించారు. కాశిరెడ్డినాయన మండలం అక్కులనారాయణపల్లెకు చెందిన దానాశివయ్య, ఉలిమెల్ల గ్రామానికి చెందిన గిద్దలూరు శివకృష్ణ, నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన సంపతి లింగమయ్యలను అరెస్టు చేశారు. చాలా రోజులుగా టీడీపీ మండల నాయకుల ఆధ్వర్యంలో విచ్చలవిడిగా జూదాలు, కోడి పందెలు సాగుతున్నాయని పోలీసులు తెలిపారు.

మేక పిల్లలు మృతి

బ్రహ్మంగారిమఠం : కుక్కలు దాడి చేసిన ఘటనలో 32 మేక పిల్లలు శనివారం మృతిచెందాయి. మండలంలోని జోకుపల్లె గ్రామానికి చెందిన జాల జ్యోతి, భర్త ప్రసాద్ జీవనోపాధికొరకు బి.కోడూరు మండలం అంకనగొడుగునూరు గ్రామానికి చెందిన యేసు రత్నం వద్ద మేకలు కాస్తూ జీవనం సాగిస్తున్నారు. మేకలను శుక్రవారం యథాప్రకారం కట్టివేసి ఉంచారు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో కుక్కలు దాడి చేయడంతో 32 మేక పిల్లలు మృతి చెంగాయి. లక్ష రూపాయలకు పైగా నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్) సమీపంలో ఓ వ్యక్తి విషపు మాత్రలు మింగి ఆత్మహత్య పాల్పడినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు నంద్యాల జిల్లా డోన్‌కు చెందిన మురహరి కుమార్ (35) కూలి పనులకు వెళుతూ జీవనం సాగించేవాడు. అప్పులు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 23న రిమ్స్ సమీపంలో గుర్తుతెలియని మాత్రలు మించి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు గమనించి ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. అతడి భార్య మహిషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేస్తున్నారు.

మహిళ మృతి.. కేసు నమోదు

ముద్దనూరు : మండలంలోని మల్లెల గ్రామానికి చెందిన లక్ష్మిదేవి ఈ నెల 26న ముద్దనూరు మండలం తిమ్మాపురానికి బయలుదేరింది. శుక్రవారం రాత్రి తిమ్మాపురం రైతు సేవా కేంద్రం వద్ద స్పృహ తప్పిపడిపోయిన ఆమెను 108లో ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

తక్షణ చికిత్సతోనే ప్రాణాలకు రక్షణ



నేడు రేబిస్ వ్యాధి నివారణ దినం

కుక్క కరిచిన ప్రదేశాన్ని సబ్బు నీళ్లతో శుభ్రం చేసుకుని సరిపెట్టుకునే వాళ్లుంటారు. కానీ పెంపుడు కుక్క, వీధి కుక్క... ఏది కరిచినా రేబీస్ రాకుండా ఇంజెక్షన్లు తీసుకోవడం తప్పనిసరి. కుక్క కరిచిన వెంటనే వైద్యుడిని సంప్రదించి టీకా వేయించుకుంటే రేబిస్ బారినుంచి తప్పించుకోవచ్చునని వైద్య నిపుణులు చెబుతున్నారు. 28న రేబిస్ నివారణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

రాజంపేట టౌన్ : రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి కుక్క కాటు కేసులో ఏటా పెరుగుతున్నాయి. 2022 నుంచి 2025 ఆగస్టు వరకు 10,104 మంది కుక్క కాటుకు గురై చికిత్స తీసుకున్నారు. ఏటా సెప్టెంబర్ 28న రేబిస్ వ్యాధి నివారణ దినం నిర్వహిస్తూ.. ప్రభుత్వం కుక్క కాటుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అయితే వీధి కుక్కల బెడద ఇటీవల పెరగడంతో పలువురు కుక్క కాటుకు గురవుతున్నారు. ప్రాథమిక ఆస్పత్రుల్లో సకాలంలో మందులు లేకపోవడంతో వేల రూపాయలు బయట ఆస్పత్రులకు ఖర్చు చేస్తున్నారు. వీధి కుక్కలను తరలించడంలో మున్సిపాల్టీ అధికారులు నిర్లక్ష్యం చేస్తుండడంతో ఏటా కుక్క కాటు కేసులు నమోదవుతున్నాయి.

వ్యాధి ఎలా వస్తుంది

గబ్బిలాలు, పిల్లులు, నక్కలు, కోతి లాలాజలంలో రేబిస్ ఉంటుంది. అవి కరచినా, వాటి లాలాజలం శరీరభాగాల్లోని ద్రవాల్లోనూ, గాయాల పైనా పడినా ప్రాణాంతకరమైన రేబిస్ వ్యాధికి దారి తీస్తుంది. రేబిస్ వైరస్ సోకిన కుక్క కరిస్తే తొలుత కండరాలకు, అనంతరం శ్వాసకోశ నాళాలకు వైరస్ సోకుతుంది.. చలాకీగా కదిలే కుక్క అకస్మాత్తుగా నీరసించడం, ఒంటరిగా ఉండిపోవడం, నోటి నుంచి సొంగ కారడం, నీటికి దూరంగా ఉండడం, గుంద్రంగా తిరుగుతూ ఉండడం వంటి లక్షణాలు కనిపించిన కుక్కకు దూరంగా ఉండాలి. వాటికి ఆహారం తినిపించడం, ఆడుకోవడం చేయరాదు.

కుక్క కరిస్తే కనిపించే లక్షణాలు

కుక్క కరచిన మనిషికి ఆకలి తగ్గడం, తల తిరగడం, జ్వరం రావడం, నీరు చూసినా భయపడడం వంటి లక్షణాలుంటాయని తెలిపారు. కుక్కలకు సోకే రేబిస్ వైరస్ శరీరంలో దీర్ఘకాలం పాటు ఉండిపోతుంది. కుక్క ప్రాణాలు కోల్పోయేలోపు ఎంతమందిని కరిస్తే అంతమందికీ రేబీస్ వైరస్ సోకుతుంది. కుక్క గోళ్లు గీసుకున్నప్పుడు వెంటనే సబ్బు నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. కొరికినప్పుడు పన్ను లోపలకు దిగి రక్తం కారితే ఆ ప్రదేశంలో ఇమ్యునోగ్లోబ్యులిన్ ఇంజెక్షన్ తీసుకోవాలి, రేబిస్ వ్యాక్సిన్ తీసుకోవాలి. వ్యాధి బాగా ముదిరితే మనిషి కుక్కలా ప్రవర్తిస్తారు. కోమాలోకి వెళ్లి శ్వాస ఆగిపోయే ప్రమాదం లేకపోలేదు.

జిల్లాలో కుకక్క కాటు కేసుల వివరాలు

సంవత్సరం	కేసుల సంఖ్య
2022	1,496
2023	2,619
2024	3,060
2025 (ఆగస్టు వరకు)	2,929

ఏ కుక్క కరిచినా..

కుక్క కరిచినప్పుడు, ఎంత లోతుగా కరిచింది అనే దాని మీదే చికిత్స ఆధారపడి ఉంటుంది. కుక్క గోళ్లతో గోకడాన్ని గ్రేడ్ ఎగా, కొరికినప్పుడు పంటి గాటు ఏర్పడితే ఆ గాయాన్ని గ్రేడ్ బిగా, పంటిగాటుతోపాటు రక్తస్రావమైతే గ్రేడ్ సిగా పరిగణించాలి. ఈ గాయాలకు రేబిక్యూర్ వ్యాక్సిన్‌తో పాటు, రేబీస్ ఇమ్యునోగ్లోబ్యులిన్ టీకా ఇవ్వాల్సి ఉంటుంది. కుక్కకు ఎలాంటి టీకాలు ఇప్పించకపోయినా, అది వీధికుక్క అయినా, పెంపుడు కుక్క అయినా రేబీస్ వ్యాక్సిన్ తీసుకోవాలి. సాధారణంగా చాలామంది వీధిలో రోజూ కనిపించే కుక్క, దానికేం కాలేదు కాబట్టి మాక్కూడా ఏం జరగదు అని చికిత్సను నిర్లక్ష్యం చేస్తుంటారు. కానీ అది ఎలాంటి కుక్క అయినా, ఎలాంటి లక్షణాలు లేకున్నా కరచిన వెంటనే తప్పనిసరిగా వైద్యులను కలిసి ఇంజెక్షన్లు తీసుకోవాలి. పెంపుడు కుక్కల నుంచి కుటుంబ సభ్యులకు వ్యాధులు సోకుతాయి కాబట్టి వాటికి తప్పనిసరిగా యాంటీ రేబీస్‌సతో పాటు లెప్టోస్పైరోసిస్ లాంటి ఇతరత్రా వ్యాధుల టీకాలు వేయించాలి.

దోసులు ఇలా..

పెంపుడు కుక్క : యాంటీ రేబీస్ టీకాలు ఇప్పించిన పెంపుడు కుక్క కరిచినప్పుడు మూడు డోసుల యాంటీ రేబీస్ ఇంజెక్షన్లు తీసుకోవాలి. కుక్క కరిచిన రోజు, ఏడవ రోజు 21 రోజు ఈ ఇంజెక్షన్లు తీసుకోవాలి.

వీధి కుక్క : ఈ కుక్క కరిచినప్పుడు ఐదు డోసుల యాంటీ రేబీస్ ఇంజెక్షన్లు తీసుకోవాలి. కుక్క కరిచిన రోజు, మూడో రోజు, ఏడవ రోజు, 14వ రోజు, 27వ రోజు ఈ ఇంజెక్షన్లు తీసుకోవాలి. 90వ రోజున బూస్టర్ డోసు తీసుకోవాలి.

కుక్క కాటు ప్రమాదం



కుక్క కరిచిన వెంటనే ఆ భాగంలో కుళాయి నీటితో పది నిమిషాల పాటు శుభ్రంగా కడగాలి. ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించి టీకాలు వేయించుకోవాలి. వైద్యులు లేకుంటే మెడికల్ స్టోర్స్‌లో లభించే అయోడిన్, సేవ్‌లాన్ వంటి యాంటిసెప్టిక్ లోషన్లు రాయాలి. గాయం అయితే వైద్యుడిని సంప్రదించి రేబిస్ ఇమ్యూనోగ్లోబులిన్ టీకా వేయించుకోవాలి. బయట ఇంజెక్షన్ కొనాలంటే రూ.3వేలు అవుతుందని, ప్రభుత్వఆస్పత్రిలో ఉచితంగా వేస్తారు.

– డాక్టర్ పాలనేని వెంకటనాగేశ్వరరాజు, సూపరింటెండెంట్, రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రి

కడపలో ఇంజినీరింగ్ విద్యార్థిని కిడ్నాప్ ..!

- సినీ ఫక్కీలో వెంబడించి పట్టుకున్న చింతకొమ్మదిన్నె పోలీసులు
- నలుగురిపై కిడ్నాప్ కేసు నమోదు

చింతకొమ్మదిన్నె/కడప అర్బన్ : కడప పులివెందుల రోడ్డులోని ఓ కళాశాల సమీపంలో ఇంజినీరింగ్ విద్యార్థిని కారులో బలవంతంగా ఎక్కించుకుని పారిపోయిన సంఘటన శనివారం జరిగింది. సీఐ బాలమద్దిలేటి వివరాల మేరకు.. తాను, తన కుమార్తె ఉండగా.. తనను పక్కకు తోసి కుమార్తెను ఎత్తుకెళ్లినట్లు తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో చింతకొమ్మదిన్నె పోలీసులు అప్రమత్తమయ్యారు. సీఐ బాలమద్దిలేటి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. కిడ్నాపర్ ముద్దనూరు మండలం బొందరకుంట గ్రామానికి చెందిన పవన్‌కళ్యాణ్ అని గుర్తించారు. అతడి కారు నెంబర్ తెలుసుకుని సీఐ బాలమద్దిలేటి ఇటు వేంపల్లె, కమలాపురం, ఎర్రగుంట్ల పోలీసులను అలర్ట్ చేశారు. దీంతో ఎర్రగుంట్లలో కిడ్నాపర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ఇంజినీరింగ్ కళాశాల వద్ద...

తొండూరు మండలం సైదాపురం గ్రామానికి చెందిన యువతి పులివెందుల రోడ్డులోని ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుతోంది. దసరా సెలవులు కావడంతో ఆ యువతి తల్లి తన కుమార్తెను తీసుకెళ్లేందుకు కాలేజీ వద్దకు వచ్చింది. ఆమె కుమార్తెతో ఊరికి వెళ్లేందుకు బస్టాపు వద్ద ఉండగా పవన్‌కళ్యాణ్, అతని సోదరుడు రాజేశ్, అరవింద్, సురేంద్రలతో కలిసి కారులో అక్కడకి వచ్చారు. యువతిని బలవంతంగా కారులో ఎక్కించే ప్రయత్నం చేయగా తల్లి అడ్డుపడింది. వారు ఆమెను కిందకు తోసివేసి కారులో ఎక్కించుకుని పరారైనట్లు తెలిపారు. యువతి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముద్దనూరు మండలం బొందలకుంటకు చెందిన పవన్ కల్యాణ్, అతని తమ్ముడు రాజేశ్, స్నేహితులు అరవింద్, సురేంద్రలపై కిడ్నాప్ కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

టీడీపీ నేతల కుట్రలతోనే మేయర్‌పై అనర్హత

కడప కార్పొరేషన్ : టీడీపీ నేతల కుట్రలతోనే మేయర్ సురేష్‌బాబుపై అనర్హత వేటు పడింతే తప్పా హైకోర్టు తొలగించలేదని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు మల్లికార్జున, కె.బాబు, ఎస్‌ఏ షంషీర్ అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో శనివారం వారు మాట్లాడుతూ టీడీపీ నగర ప్రధాన కార్యదర్శిగా కొత్తగా నియమితులైన సుబ్బారెడ్డి మాట్లాడిన మాటలన్నీ శుద్ధ అబద్ధాలన్నారు. మేయర్‌గా సురేష్‌బాబు అవినీతికి పాల్పడినట్లు విజిలెన్స్ విచారణలో ఎక్కడా లేదని, ఎమ్మెల్యే మాధవి ప్రభుత్వానికి రాసిన తన లేఖలోనూ ఆ విషయం చెప్పలేదన్నారు. మేయర్ కుటుంబ సభ్యులు కాంట్రాక్ట్ పనులు చేయకూడదన్న ఒకే ఒక్క కారణం చూపి ఆయనపై అనర్హత వేటు వేశారన్నారు. దేశంలో ఎక్కడా ఇలాంటి సంఘటన జరగలేదన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి ఫిరాయించిన ఎనిమిది మంది కార్పొరేటర్లలో నలుగురు వైఎస్సార్‌సీపీలో కీలకంగా వ్యవహరించారని, మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా వారికి అగ్రపీఠం వేశారని గుర్తుచేశారు. టీడీపీలో రెండు, మూడు గ్రూపులుగా విడిపోయి ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ బజారున పడుతున్నారేగానీ, ఇందులో వైఎస్సార్‌సీపీ పాత్ర ఏమీ లేదన్నారు. మాజీ మేయర్ సురేష్ బాబును విమర్శించే స్థాయి, అర్హత సుబ్బారెడ్డికి లేదన్నారు. ఎమ్మెల్యే మాధవిని టీడీపీలోని ఓ మహిళ ఏడాదిన్నర క్రితం దూషించి వీడియో పెట్టారని, ఆమెను నిన్న, మొన్న అరెస్ట్ చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. టీడీపీ నగర అధ్యక్షుడిగా ఉన్న శివకొండారెడ్డి అప్పట్లోనే ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేశారన్నారు. ఎమ్మెల్యే మనుషులు నడిరోడ్డుపై శివకొండారెడ్డిపై దాడిచేసి రిటర్న్ గిఫ్ట్ కూడా ఇచ్చారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవరాజుమాట్లాడుతూ సుబ్బారెడ్డి కార్పొరేటర్ పదవికి రాజీనామా చేసి టీడీపీ నగర ప్రధాన కార్యదర్శిగా మాట్లాడాలని హితవు పలికారు. కె.బాబు, శివకోటిరెడ్డి, షంషీర్, రామలక్ష్మణ్‌రెడ్డి, చంద్రహాసరెడ్డి, షఫీ, అజ్మతుల్లా, గౌస్, అక్బర్, త్యాగరాజు, కిరణ్, నాగమల్లారెడ్డి, సుబ్బరాయుడు, శంకరాపురం సింధు, శ్రీరంజన్‌రెడిడ, డిష్ జిలాన్, రెడ్డి ప్రసాద్, బండి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పండగ వేళ.. ఇల్లు జాగ్రత్త

జిల్లా ఎస్పీ ధీరజ్ కనుబిల్లి



రాయచోటి : దసరా పండగ సెలవులు వచ్చాయని ఊళ్లకు వెళ్లే సందర్భంలో ఇల్లు జాగ్రత్తగా చూసుకోవాలని ఎస్పీ ధీరజ్ కనుబిల్లి ఓ ప్రకటనలో సూచించారు. ఇంటికి తాళం కనిపించినపుడే దొంగలు గుర్తిస్తారని ఎస్పీ హెచ్చరించారు. తలుపులకు తాళం సరిగా వేయకపోవడం, బయట తాళం వేసి వెళ్లిపోవడం, విలువైన వస్తువులు ఇంట్లో వదిలేయడం చేస్తే దొంగలకు ఆహ్వానం పలికినట్లే అన్నారు. ఇంట్లో సీసీ కెమేరాలు, అలారం, సెన్సార్ లైట్లు అమర్చాలన్నారు. ఊరిలో పరిచయం లేని వ్యక్తులు తిరుగుతుంటే జాగ్రత్తగా గమనించాలని సూచించారు. మీరు ఇంట్లో లేనప్పుడు ఆ వివరాలను సోషల్ మీడియాలో పోస్టు చేయడంతోనూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. నమ్మకమైన వారికి మాత్రమే కనిపించేలా ప్రైవసీ సెట్టింగ్స్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

జాక్‌పాట్ పేరుతో మోసం



టమాటా రైతులను విచారిస్తున్న అధికారులు

గుర్రంకొండ : జాక్‌పాట్ పేరుతో తమను దగా చేస్తున్నారని మార్కెటింగ్ శాఖ అధికారులకు టమాట రైతులు శనివారం ఫిర్యాదు చేశారు. వారం రోజుల కిందట మార్కెట్ యార్డులో జరిగే అన్యాయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం రాయచోటి మార్కెటింగ్ శాఖ ఏడీఏ త్యాగరాజు గుర్రంకొండ యార్డులో విచారణ చేపట్టారు. పలువురు రైతులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. జాక్‌పాట్ పేరుతో వందకు పది నుంచి 12 క్రేట్ల టమాటాలను బలవంతంగా తీసుకొంటున్నారని పేర్కొన్నారు. దానికి తోడు టమాటాలను క్రేట్‌లపై రాశులుగా పోస్తున్నారని, కమీషన్లు పది శాతం తీసుకొంటున్నారని ఫిర్యాదు చేశారు. వేలం పాట పాడుకొనే ధరల కంటే క్రేట్‌పై రూ.50 నుంచి రూ.70 వరకు కోత విధిస్తున్నారని వాపోయారు. 25 కిలోల క్రేట్లకు బదులుగా 15 కిలోల క్రేట్లు మండీల్లో ఏర్పాటు చేస్తామని వ్యాపారులు చెబుతున్న మాటలు నీటిమూటలుగా మిగిలిపోతున్నాయని ఆరోపించారు. సమస్యలపై ఎన్ని మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకొనే వారే కరువయ్యారని రైతులు పేర్కొన్నారు. అనంతరం రైతుల వద్ద లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు ఏడీఏ స్వీకరించారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాల్మీకిపురం మార్కెట్ కమిటీ కార్యదర్శి కుమార్‌రెడ్డి, సిబ్బంది. రైతులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో అధ్యాపక బృందం

పుల్లంపేట : స్థానిక మోడల్ స్కూల్ క్రీడా మైదానంలో కడప జిల్లా సబ్ జూనియర్ బాలబాలికలు, సీనియర్ పురుషుల సాఫ్ట్ బాల్ జట్లను శనివారం ఎంపిక చేసినట్లు రాష్ట్ర సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సభ్యులు ఎస్‌పి.రమణ, నరసింహారెడ్డి తెలిపారు. వారు మాట్లాడుతూ అక్టోబర్ 3, 4, 5వ తేదీలలో విశాఖపట్టణంలో జరిగే సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలలో పాల్గొనే ఉమ్మడి కడప జిల్లా జూనియర్ బాల, బాలికల జట్టును, నవంబర్‌లో జరిగే సీనియర్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు పురుషుల జట్టును ఎంపిక చేశామన్నారు. ఒక్కో జట్టులో పదహారు మంది సభ్యులు ఉంటారన్నారు ఈ కార్యక్రమంలో ఆల్ఫామెరైన్ అధినేత సుధాకర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ లీలాశ్రీహరి, ఫిజికల్ డైరెక్టర్ నీలకంఠరావు పాల్గొన్నారు.

మెడికల్ షాప్ యజమాని అదృశ్యం

- చిప్పిలి సమీపంలో ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ లభ్యం
- హంద్రీనీవా కాలువలో గాలించిన తాలూకా పోలీసులు



శ్రీకాంత్ (ఫైల్)

మదనపల్లె రూరల్ : పట్టణంలోని గాయత్రి మెడికల్స్ షాపు యజమాని అదృశ్యమైన సంఘటన పట్టణంలో కలకలం రేపింది. పట్టణంలోని రోజా ఫ్లాట్స్‌లో నివాసముంటున్న శ్రీకాంత్(58) చిత్తూరు బస్టాండ్‌లో గాయత్రి మెడికల్ షాప్ నిర్వహిస్తున్నాడు. ఈయనకు భార్య గాయత్రి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఒక కుమారుడు విదేశాల్లో ఉండగా, మరో కుమారుడికి నెల రోజుల్లో వివాహం చేయాలని నిశ్చయించారు. ఈ క్రమంలో శ్రీకాంత్ శుక్రవారం ఉదయం రాయచోటికి ద్విచక్రవాహనంలో వెళ్లాడు. రాత్రియినా రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో శనివారం ఉదయం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చిప్పిలి సమీపంలో హంద్రీ నీవా కాలువ గట్టుపై ద్విచక్ర వాహనం గుర్తించిన పోలీసులు తాలూకా స్టేషన్‌కు వెళ్లాలని శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు సూచించారు. తాలూకా ఎస్‌ఐ చంద్రమోహన్, ఫైర్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి హంద్రీనీవా కాలువలో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. శ్రీకాంత్ గత కొంత కాలంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీఎస్‌టీ తగ్గింపుతో అందరికీ ప్రయోజనం



మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మీనరసయ్య

రాయచోటి టౌన్ : కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీ తగ్గించడంతో సాధారణ ప్రజలందరికీ ప్రయోజనం ఉందని అన్నమయ్య జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ లక్ష్మీనరసయ్య అన్నారు. వైద్య సిబ్బందితో శనివారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 25వతేదీ నుంచి అక్టోబర్ 19వ తేదీ వరకు సూపర్ జీఎస్‌టీ సూపర్ సేవింగ్ మాసోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా శాఖల వారీగా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. 25వ తేదీ నుంచి 29వ తేదీ వరకు జీఎస్‌టీపై అవగాహన, 30వ తేదీ నుంచి అక్టోబర్ 6వ తేదీ వరకు వ్యవసాయం, ఉద్యానవనం, ఉపాధి హామీ కూలీలకు అవగాహన, 7వ తేదీ నుంచి 13వ తేదీ వరకు మానవ వనరులు, విద్య, ఆరోగ్యం, అభివృద్ధి సాధికారితలపై అవగాహన, 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ వికాస్ విశ్వాస ర్యాలీలు, సమావేశాలు, క్విజ్ పోటీలు, సెమినార్లు, వివిధ రకాల పోటీల నిర్వహణ, 19నుంచి మండల, జిల్లా స్థాయి దీపావళి సంబరాలు ఉంటాయని తెలిపారు.

కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య



నాగేంద్రబాబు మృతదేహం

మదనపల్లె రూరల్ : కుటుంబ సమస్యలు, రుణ బాధలు అధికమై మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. కొండామారిపల్లె పంచాయతీ పుంగనూరు వాండ్లపల్లెకు చెందిన చంద్రశేఖర్ కుమారుడు యు.నాగేంద్రబాబు(38)కు 15 ఏళ్ల క్రితం నాగమణితో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. నాగేంద్రబాబు ప్లంబర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంతకాలంగా కుటుంబ అవసరాల కోసం పలువురి వద్ద రూ.3 లక్షల వరకు అప్పుచేశాడు. పైగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో తరచూ కుటుంబంలో గొడవలు జరుగుతుండేవి. వారం రోజుల క్రితం భార్య నాగమణి, భర్తతో గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయింది. రుణదాతల నుంచి ఒత్తిడి అధికమైంది. ఈ నేపథ్యంలో ఓ వైపు కుటుంబసమస్యలు, మరోవైపు రుణ బాధలు భరించలేక నాగేంద్రబాబు శనివారం తన ఇంటిలో తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు బాధితుడిని ఉరి నుంచి కిందకు దించి పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు.

టీకాతో ప్రాణాంతక వ్యాధులు నయం

– జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు



ప్రతిజ్ఞ చేస్తున్న డీఎంహెచ్‌ఓ నాగరాజు

సిద్దవటం : ప్రాణాంతకమైన వ్యాధులను టీకాతో నయం చేయవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. మండలంలోని పొన్నవోలు కొత్తపల్లి పీహెచ్‌సీలో స్వస్థ నారీ స్వశక్తి పరివార్ కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులకు పోషకాహారం అందించామని, చిన్నపిల్లలకు టీకాలు వేయించి, వృద్ధులకు మధుమేహం, రక్తపోటు పరీక్షలు నిర్వహించామని తెలిపారు. రొమ్ము క్యాన్సర్ నోటి క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ సోకితే భయపడవద్దన్నారు. అనంతరం స్వచ్ఛ నారీ సశక్త్ పరివార్ గురించి ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ జె.ప్రవీణ్‌కుమార్, వైద్యాధికారిణి పి.రంగలక్ష్మి, పి.సందీప్, హర్షిత, కల్పన, మంజుల, సూర్యప్రకాష్, యూనస్, లక్ష్మీనరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు చరమగీతం పలికే ఆయుధం డిజిటల్ బుక్

- వైఎస్.జగన్ నేతృత్వంలో న్యాయ యుద్ధానికి శ్రీకారం
- ప్రతి కార్యకర్త మొబైల్‌లో డిజిటల్ బుక్ యాప్ ఉండాలి
- వైఎస్సార్‌సీపీ నాయకుల పిలుపు



డిజిటల్ బుక్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, రమేష్‌కుమార్‌రెడ్డి, తదితరులు

రాయచోటి : అన్యాయాలు, అక్రమాలకు చరమగీతం పలికే ఆయుధంగా డిజిటల్ బుక్ ఉంటుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, హిందూపురం పరిశీలకులు రమేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాయచోటి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్ జగనమోహన్‌రెడ్డి ఆదేశాలకు డిజిటల్ బుక్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, నాయకులకు రాజకీయ వేదింపులపై న్యాయపోరాటం సాగించేందుకు డిజిటల్ బుక్ ఆయుధంగా పనిచేస్తుందన్నారు. ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ధీజీజ్బ్సీ ఖౌాజు. శ్రీఢఙఱఛిఇ ఛౌరుు, లోగానీ లేదా ఐవీఆర్‌ఎస్ ఫోన్ నెంబరు 040-49171718 ద్వారా కార్యకర్తలు తమకు జరిగే అన్యాయాలు, రాజకీయ దాడుల వివరాల ఫొటోలు, ఆధారాలతో సహా అప్‌లోడ్ చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కుట్ర చేసిన వారిని శిక్షిస్తామని పార్టీ అధినేత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చారన్నారు. రాష్ట్రంలో కూటమి పాలన పూర్తిస్థాయి అక్రమాలకు, అరాచకాలకు నిలయంగా మారిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భూముల ఆక్రమణలకు పాల్పడుతున్నారని, వ్యాపారులు కప్పం కట్టాలంటూ బెదిరించడం, వినకపోతే దాడులకు పాల్పడడం దారుణమన్నారు. సామాజిక మాధ్యమ కార్యకర్తపై నమోదైన కేసును సీబీఐ దర్యాప్తుకు చేరుకోవడం అధికారుల ఏకపక్ష వైఖరికి బలాన్నిస్తోందన్నారు. అభిమాని తన మొబైల్‌లో డిజిటల్ బుక్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, ప్రజలలోకి తీసుకెళ్లాలని కోరారు. ప్రజా వ్యతిరేక విధానాలను మానకపోతే కూటమి ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ నెల 28న అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలు, 29న మండల కేంద్రాలలో డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. న్యాయస్థానాల ఆదేశాలను కూడా అవహేళన చేస్తున్న కూటమి ప్రభుత్వం, ప్రజాస్వామ్యాన్ని పాతాళానికి నెట్టుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫయాజుర్ రెహమాన్, కొలిమి హరూన్‌బాషా, బేపారి మహమ్మద్‌ఖాన్, పల్లపు రమేష్, శ్రీనివాసులురెడ్డి, రియాజుర్ రెహమాన్, సాధిక్‌అలీ, షబ్బీర్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, సుగవాసి శ్యామ్, విజయభాస్కర్, అంజనప్ప, ఖలీల్, బేపారి అసద్, కొత్తపల్లి ఇంతియాజ్, ఫైరోజ్, బేపారిజబీఉల్లాఖాన్, బుజ్జిబాబు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.